సాగు చేసే రైతులకే 'రైతుభరోసా'

- గ్రీన్‌ఫీల్డ్ హైవే వద్ద ఎగ్జిట్ పాయింట్ మంజూరు
- వేంసూరు పర్యటనలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఎమ్మెల్యేతో కలిసి సొసైటీ పెట్రోల్ బంకు ప్రారంభం

వేంసూరు, జూలై 8: సాగు చేసే రైతులకే రైతు భరోసా అందించే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. దీనికోసం ఇప్పటికే సహకార సంఘాల్లో, రైతువేదికల్లో రైతుల అభిప్రాయం సేకరించినట్లు చెప్పారు. త్వరలో మంత్రులతో జిల్లాస్థాయిలో అభిప్రాయ సేకరణ చేసి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వేంసూరులో స్థానిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్‌బంక్‌ను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రీన్‌ఫీల్డ్‌హైవేను, స్థానికంగా దాని ఎగ్జిట్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. రైతులు సాగు చేసే పంటలపై ప్రకృతి విపత్తుల వల్ల నష్టం వాటిల్లితే రైతు నష్టపోకుండా ఉండేలా పంటల బీమా వర్తింపజేసేందుకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించనుందని అన్నారు. రైతుబీమాను సైతం కొనసాగించే యోచనలో ప్రభుత్వం ఉందని, రైతుబీమాకు రూ.2 వేల కోట్ల ప్రీమియాన్ని చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. తనను భుజాలపై ఎత్తుకొని రాజకీయ అక్షరాభ్యాసం నేర్పిన సత్తుపల్లి నియోజకవర్గానికి గోదావరి జలాలను తీసుకురావడమే తన ఏకైక లక్ష్యమని అన్నారు. మరో నెలలో వైరా రిజర్వాయర్‌కు, లంకపల్లి రిజర్వాయర్‌కు గోదావరి జలాలను తీసుకొస్తామన్నారు. వచ్చే సంవత్సరం వేంసూరు మండలానికి కూడా గోదావరి జలాలు అందించే బాధ్యత తనదేనన్నారు. ఆగస్టు 15 నాటికి రుణమాఫీ చేసి తీరుతామన్నారు. రైతులు పామాయిల్ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ ఏడాది పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు సైతం ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ సారయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు దొండపాటి వెంకటేశ్వరరావు, అబీద్‌ఉర్‌రహమాన్, ఖుర్షిద్, గొర్ల సంజీవరెడ్డి, చల్లగుండ్ల కృష్ణయ్య, పగుట్ల వెంకటేశ్వరరావు, నున్న రాంబాబు, నాయుడు వెంకటేశ్వరరావు, తక్కెళ్లపాటి గోపాలకృష్ణ, గండ్ర సోమిరెడ్డి, నాని పాల్గొన్నారు.

వేంసూరు : గ్రీన్‌ఫీల్డ్‌హైవే వద్ద రైతులతో మంత్రి తుమ్మల

'సీతారామ' కాలువ పనుల పరిశీలన..

వైరా టౌన్, జూలై 8: వైరా రిజర్వాయర్‌కు అనుసంధానం చేసే సీతారామ ప్రాజెక్టు కాలువ పనులను అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఏన్కూరు మండలం ఇమామ్‌నగర్ వద్ద సీతారామ ప్రాజెక్టు లింకు కెనాల్ పనులను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి మంత్రి తుమ్మల సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు వేగవంతమయ్యేందుకు ఎక్కువ మొత్తంలో యంత్రాలను వినియోగించాలని సూచించారు. సీపీ సునీల్‌దత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నర్సరీల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

- ఏడీఏ విజయచంద్ర

ఖమ్మం రూరల్, జూలై 8 : నర్సరీల నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కూసుమంచి డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు ఎస్ విజయచంద్ర తెలిపారు. సోమవారం ఆయన మండల వ్యవసాయశాఖ అధికారి వీ నాగేశ్వరరావుతో కలిసి మంగళగూడెం, పోలిశెట్టిగూడెం, మద్దివారిగూడెం గ్రామాల్లో పర్యటించారు. పలు మిర్చి నర్సరీలను పరిశీలించి తగు సూచనలు చేశారు. తీర్థాల, యం వెంకటయపాలెం, కొండాపురం, తల్లంపాడు గ్రామాలలో పర్యటించి విత్తన, ఎరువుల షాపులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ విస్తరణ అధికారి ఉపేందర్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మిర్చి నర్సరీల యజమానులతో మాట్లాడుతున్న ఏడీఏ విజయచంద్ర

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మం రూరల్, జూలై 8 : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ(ఏదులాపురం) ఏఈ క్రాంతి సిన్హా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దతండా పంచాయతీలోని 11కేవీ సబ్‌స్టేషన్ ఫీడర్ పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు ఉంటుందని, పెద్దతండా, ఏదులాపురం పరిధిలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

కేయూ డిగ్రీ ఫలితాల్లో జేవీఆర్ విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిటౌన్, జూలై 8: కాకతీయ విశ్వవిద్యాలయం బీఏ, బీకాం, బీఎస్సీ ఫైనలియర్ ఆరవ సెమిస్టర్ ఫలితాలను సోమవారం విడుదల చేసింది. స్థానిక జేవీఆర్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు 60 శాతం ఉత్తీర్ణత సాధించారు. బీఎస్సీ డైరీ సైన్స్‌లో మండకం మురారి 8.85 ఎస్‌జీపీఏ, బీఏలో తిరుమణి శివహర్షిత 8.65, బీఎస్సీ బీజెడ్‌సీలో చెల్లిముంత యామిని 8.64, బీఎస్సీ ఫిజికల్ సైన్సెస్ రామిశెట్టి చరిత 7.95, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ పిట్టల జ్యోతిప్రసన్న 7.82 ఉత్తీర్ణత పొందారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే విజయ్‌కుమార్, అకడమిక్ కోఆర్డినేటర్ ఎం.రాంబాబు అభినందించారు.

పలు కుటుంబాలకు ఎంపీ పరామర్శ

కూసుమంచి, జూలై 8 : కూసుమంచిలోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో స్వర్గీయ మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఈశ్వరమాధారం మాజీ సర్పంచ్ ఏరబోలు సూర్యానారాయణరెడ్డి తండ్రి మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. జీళ్లచెరువులో వైఎస్ఆర్ జయంతిలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఎంపీపీలు బానోత్ శ్రీనివాస్, బోడా మంగీలాల్, జొన్నలగడ్డ రవికుమార్, రామసహాయం బాలకృష్ణారెడ్డి, జూకూరి గోపాల్‌రావు, కంచర్ల చంద్రశేఖర్, హఫీజుద్దీన్, రామసమాయం మాధవీరెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 8: ఖమ్మంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, కామర్స్, పొలిటికల్ సైన్స్‌లో ఒకటి చొప్పున ఖాళీలున్నట్లు చెప్పారు. ఈ నెల 10లోగా తమ కళాశాలలో దరఖాస్తులను అందజేయాలని కోరారు.

'సర్వజ్ఞ'లో రెడ్ అండ్ ఎల్లో డే

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 8: ఖమ్మంలోని సర్వజ్ఞ పాఠశాలలో రెడ్ అండ్ ఎల్లో డే వేడుకలను సోమవారం నిర్వహించారు. విద్యార్థులు ఎరుపు, పసుపు రంగుల దస్తులు ధరించి పాఠశాలకు హాజరయ్యారు. అలాగే, ఆయా రంగులతో పాఠశాల ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. పాఠశాల డైరెక్టర్లు రాజా వాసిరెడ్డి నాగేంద్రకుమార్, నీలిమ పాల్గొన్నారు.

'త్రివేణి'లో ఎల్లో డే వేడుకలు

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 8: త్రివేణి పాఠశాలలో ఎల్లో డే వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల బాధ్యులు మాట్లాడుతూ.. పసుపు ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు 'రెజొనెన్స్' విద్యార్థిని

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 8: ఖమ్మం రెజొనెన్స్‌శ్రీనగర్ పాఠశాలకు చెందిన విద్యార్థిని జే.అవంతిక జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ అండర్-15 పోటీల్లో ప్రతిభ కనబర్చింది. రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ మేరకు సదరు విద్యార్థినిని పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు సోమవారం అభినందించారు. ఈ నెల 15న మెదక్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థిని పాల్గొననున్నట్లు వివరించారు.

ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డుకు సన్మానం

మామిళ్లగూడెం, జూలై 8: ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు షేక్ మస్తాన్‌ను సీపీ సునీల్‌దత్ పూలమాలలు, శాలువలతో సన్మానించారు. పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో సీపీ మాట్లాడారు. సుదీర్ఘకాలంగా బాధ్యతయుతంగా పనిచేసిన మస్తాన్.. ఎందరో అధికారుల మన్ననలు పొందారని గుర్తుచేశారు. ఏఆర్ ఏసీపీ సుశీల్‌సింగ్, హోంగార్డుల అధికారులు సురేశ్, మహ్మద్ రఫీ, నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డును సన్మానిస్తున్న పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

ప్రకటన

ఇందుమూలముగా నాక్కలుంటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **మలిపెడ బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **బానోత్ సత్య** తండ్రి :**అమర్ సింగ్ వయస్సు** : 25సం॥లు, **వృత్తి** : వ్యవసాయం, **నివాసం:** ఎనకుంటతండ గ్రామం, తిరుమలాయపాలెం మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయిం చుకున్నారు.కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి: ఖమ్మం రిజిస్ట్రేషన్ జిల్లా, కూసుమంచి సబ్ జిల్లా, ఖమ్మం జిల్లా ప్రజా పరిషత్ కూసుమంచి సబ్ రిజిస్ట్రారు వారి అధికార పరిధిలోని, తిరుమలాయపాలెం మండలం, కాకరవాయి రెవిన్యూ గ్రామ మిం.లే ఎనకుంటతండా గ్రామకంఠం లోని ఎనకుంటతండ గ్రామపంచాయితీ పరిధిలోని ఇంటి నెంబరు : 1-68, With Assessment Number : 85, డాక్యుమెంట్ నెం. 2112/2024, గా గల స్థల విస్తీర్ణము : 148-09చ॥గ॥ = 123.82 చ॥మీ॥ లలో నిర్మించబడిన RCC Roof House Plinth Area 331-61 చ॥అ॥, G.I., Sheet Roof Toilets Plinth Area 44-00, చ॥అ॥ గల స్థిరాస్తినకు హద్దులు :**తూర్పు** : బి. హరించందు గారి ఇల్లు, **పడమర** : స్వంత దారి & ఇతరుల ఖాళీ స్థలము, **ఉత్తరం** : బి. నర్సింగ్ గారి ఇల్లు, **దక్షిణము** : బి.కిషన్ గారి ఖాళీ స్థలం.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

నేడు సదరం శిబిరం

ఖమ్మం సిటీ, జూలై 7: జిల్లాలోని దివ్యాంగులకు పింఛన్ సదుపాయం కోసం అర్హత సర్టిఫికెట్లు జారీ చేసే నిమిత్తం జిల్లా సార్వజనీన ఆసుపత్రిలో మంగళవారం సదరం శిబిరాన్ని ఏర్పాటు చేశామని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థోపెడిక్ (ఎముకలు, కీళ్లు), కంటి, సైకియాట్రిక్ (మానసిక రుగ్మతలు) వంటి విభాగాలకు మొత్తం 160 మంది స్లాట్ బుక్ చేసుకున్నారని వెల్లడించారు. వారికి ఆయా విభాగాల వైద్యులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారంతా సకాలంలో ఆసుపత్రికి హాజరు కావాలని సూచించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

అమ్మిన శిశువు అమ్మ చెంతకు..

- పుట్టిన శిశువును ఆస్పత్రిలోనే విక్రయించిన తల్లిదండ్రులు
- నాలుగు నెలల తర్వాత తల్లి ఒడికి చేర్చిన ఐసీడీఎస్ అధికారులు
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

తిరుమలాయపాలెం, జూలై 8 : మూడో కాన్పులోనూ ఆడపిల్లే జన్మించడంతో సాకలేమని భావించి ఆ శిశువును ఆస్పత్రిలోనే అమ్మేసిన తల్లిదండ్రులు అమాయకంగా పాపం మృతిచెందినట్లు అందరినీ నమ్మించారు. కానీ.. అది అబద్ధమని ఆనోటా ఈనోటా ప్రచారం కావడంతో ఐసీడీఎస్ అధికారులు ఎట్టకేలకు నాలుగు నెలల పసిపాపను తల్లి ఒడికి చేర్చారు. అయితే దీనంతటికీ కారణం అంగన్‌వాడీ టీచర్ జయమ్మే కారణమంటూ దుర్భాషలాడుతూ ఆమెపై శిశువు తల్లిదండ్రులు, బంధువులు దాడికి యత్నించారు. దీంతో ఆమె సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు బండారం బయటపడింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మేకలతండాకు చెందిన బానోత్ విజయ మార్చి 24న ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పండంటి ఆడపిల్లకు జన్మనిచ్చింది. అయితే ఇదివరకే ఇద్దరు ఆడపిల్లలు కావడంతో భారంగా భావించిన ఆ తల్లిదండ్రులు సాకలేమనే ఉద్దేశంతో ఓ గ్రామీణ వైద్యుడి సాయంతో ఆడశిశువును అమ్మేశారు. ఈ క్రమంలోనే తమ పుట్టిన బిడ్డ చనిపోయిందని బంధువులు, గ్రామస్తులను నమ్మించారు. అయితే గ్రామంలో జన్మించిన పిల్లల వివరాలను ఫొటోలతో సహా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీనిపై అంగన్‌వాడీ టీచర్ జయమ్మ శిశువు తల్లిదండ్రులను వివరాలు అడగ్గా.. వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు సమాచారం ఇచ్చింది. దీనిపై సమగ్ర విచారణ చేసిన ఐసీడీఎస్ అధికారులు అమ్మిన శిశువును గుర్తించి పది రోజుల క్రితం తల్లి ఒడికి చేర్చారు. ఐసీడీఎస్ అధికారులు సైతం శిశువు అమ్మకం విషయాన్ని గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శిశువు అమ్మకం విషయం అంగన్‌వాడీ టీచర్ జయమ్మ ద్వారానే బయటకు వచ్చిందని తల్లిదండ్రులు విజయ, భావత్‌సింగ్, బంధువులు సోమవారం ఆమెను దూషిస్తూ దాడికి యత్నించగా.. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారికి ఆశా వర్కర్ బోడ సుజాత కూడా సహకరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సీడీపీవోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా శిశువు తల్లిదండ్రులకే మద్దతు పలికినట్లు అంగన్‌వాడీ టీచర్ జయమ్మ ఆవేదన వ్యక్తం చేసింది.

పదిమంది జూదరుల అరెస్టు

రూ.11 లక్షల నగదు, 3 కార్లు, 10 మొబైళ్లు స్వాధీనం

రఘునాథపాలెం, జూలై 8: ఓ ఇంటో రహస్యంగా పేకాట ఆడుతున్న జూదరులను టాస్క్‌ఫోర్స్, ఖానాపురం హవేలీ పోలీసులు సోమవారం ఆకస్మిక దాడి చేసి పట్టుకున్నారు. సీఐ భానుప్రకాశ్ కథనం ప్రకారం.. ఖమ్మం అర్బన్ పరిధిలోని సాయినగర్ ప్రాంతంలోని చెరుకుమల్లి శ్రీనివాస్ ఇంట్లో కొందరు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సీపీ సునీల్ దత్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్, హవేలీ పోలీసులు సదరు ఇంటిపై దాడి చేశారు. పదిమంది వ్యక్తులు కలిసి చెరుకుమల్లి శ్రీనివాస్ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు గుర్తించారు. పట్టుబడిన సమయంలో జూదరుల వద్ద నుంచి రూ.11,30,670 నగదు, మూడు కార్లు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతూ పట్టుబడిన వారిలో ఖమ్మం సాయినగర్‌కు చెందిన చెరుకుమల్లి శ్రీనివాస్, నాయుడుపేటకు చెందిన మిర్చీ గుమస్తా అల్లం రమేశ్, లెనిన్‌నగర్‌కు చెందిన షేక్ హుస్సేన్, రఘునాథపాలేనికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి బోడ రవికుమార్, ఇల్లెందుకు చెందిన కోలేటి ఓంప్రకాశ్, ఓరుకొండ ధనుంజయ్, వంగూరి శ్రీనివాసరావు, బొల్లెడు నిరంజన్, దాట్ల జగన్నాథం, కారేపల్లికి చెందిన లకావత్ బాబు ఉన్నారు. వీరిపై తెలంగాణ స్టేట్ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

మధిర, జూలై 8 : మండలంలోని వైరా నదిలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రహదారి మోరీలో వ్యక్తి ఇరుక్కుపోయి మృతిచెందాడు. వివరాల్లోకెళ్తే.. మహాశివరాత్రి సందర్భంగా మధిర శివాలయ ప్రాంతంలోని వైరానదిలో మడుపల్లి రోడ్డుకు తాత్కాలికంగా మోరీలు వేసి రహదారి సౌకర్యాన్ని ఆనాడు ఏర్పాటు చేశారు. ఈ మార్గం గుండా వాహనదారులు వస్తూపోతూ ఉంటారు. అయితే రెండురోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఈ రోడ్డుపై నీటి ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తున్నది. అయినప్పటికీ కొంతమంది ద్విచక్ర వాహనదారులు ఈ మార్గం గుండానే వెళ్తున్నారు. ఈక్రమంలో సోమవారం ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామానికి చెందిన బోశెట్టి రమేశ్(35) తన ద్విచక్ర వాహనంపై మధిర నుంచి మడుపల్లి వైపు వెళ్తున్నాడు. వరద ప్రవాహానికి రోడ్డు కనిపించకపోవడంతో మోరీలో వాహనంతోపాటు ఇరుక్కుపోయాడు. బయటకు రాకలేక నీటిలో ఊపిరాడక మృతిచెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి ద్విచక్ర వాహనంతోపాటు రమేశ్ మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని మధిర ప్రభుత్వ ఆసుపత్రికి పంచనామా నిమిత్తం తరలించారు.

ఆటో పల్టీ.. ఇద్దరు విద్యార్థులకు గాయాలు

మామిళ్లగూడెం, జూలై 8: ఆటో పల్టీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు గాయాలైన ఘటన ఖమ్మంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం దానవాయిగూడేనికి చెందిన ఇద్దరు సోదరులు నగరంలోని బైపాస్ రోడ్డు సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్నారు. వారు సోమవారం ఉదయం పాఠశాల వద్దకు ఆటోలో వస్తున్న క్రమంలో ఎన్‌టీఆర్ సర్కిల్ సమీపంలో ఓ ద్విచక్రవాహనం అతివేగంగా వచ్చి రోడ్డును దాటుతోంది. ఈ క్రమంలో విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటోడ్రైవర్ ఒక్కసారిగా తన ఆటో బ్రేకులు వేశాడు. దీంతో ఆటో అదుపుతప్పి పల్టీ కొట్టింది. దీంతో ఆటోలోని ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఒకరికి చేయి ఫ్రాక్చర్ అయింది. మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి ఆటోలోంచి ఆ పిల్లలను బయటకు తీసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తల్లిదండ్రులు వచ్చి వారిని ఆసుపత్రికి తరలించారు.

భవనం పైనుంచి జారిపడి వ్యక్తి మృతి

మామిళ్లగూడెం, జూలై 8: కూలి పనులకు వచ్చి ప్రమాదశాత్తూ ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఖమ్మంలో సోమవారం చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. రఘునాథపాలెం మండలం రేగులచెలక గ్రామానికి చెందిన కొర్లపాటి జోజీ అనే వ్యక్తి కూలి పనుల నిమిత్తం సోమవారం ఖమ్మం నగరానికి వచ్చాడు. మరికొందరితో కలిసి నగరంలోని చెరువుబజార్‌లో ఓ పాత భవనంపై పేరుకపోయిన చెత్తను తొలగిస్తున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా కాలు జారి పడ్డాడు. వెంటనే అప్రమత్తమైన తోటి కూలీలు.. భవన యజమానికి సమాచారం అందించి ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి అప్పటికే అతడు మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి భార్య కరుణ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు

రఘునాథపాలెం, జూలై 8: బాలుడు కనిపించకుండా పోయిన ఘటనపై ఖానాపురం హవేలీ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ భానుప్రకాశ్ కథనం ప్రకారం.. ఖమ్మం కైకొండాయిగూడెం రైల్వే కాలనీకి చెందిన చింతమల్ల విలియన్ (13) నగరంలోని త్రివేణి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆ తరువాత తిరిగిరాలేదు. బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సదరు బాలుడి తండ్రి కరుణాకర్ పోలీసులను ఆశ్రయించాడు.

వ్యక్తి అదృశ్యం

చింతకాని, జూలై 3 : నాగిలిగొండ గ్రామానికి చెందిన నారగాని లింగయ్య గత నెల 19వ తేదీ నుంచి కనిపించడం లేదని చింతకాని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. భార్య రాధమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

ఎర్రుపాలెం, జూలై 8 : కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఎర్రుపాలెం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పెరుమాళ్లపల్లి శ్రీనివాసరావు సోమవారం మృతిచెందారు. ఆయన మృతిపట్ల మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, జడ్పీటీసీ శీలం కవిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

సంక్షిప్తం

'ఎస్ఐ ఆత్మహత్యకు కారకులను శిక్షించాలి'

మామిళ్లగూడెం/ రఘునాథపాలెం, జూలై 8: అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీను ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షించాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఐ ఆత్మహత్యను ప్రభుత్వ హత్యగా పరిగణించాలని కోరారు. ఎస్ఐ ఆత్మహత్యకు కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పూలే అంబేద్కర్ అధ్యయన వేదిక, స్వేరోస్ నెట్‌వర్క్, బీడీఎస్ఎఫ్, మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మంలోని జడ్పీ సెంటర్‌లో సోమవారం సాయంత్రం కొవ్వొత్తులు ప్రదర్శిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఎస్ఐ శ్రీనును వేధించిన సీఐ జితేందర్ రెడ్డి.. గతంలోనూ అనేకమందిని వేధించారని అన్నారు. ఆయా పార్టీలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి: కేవీపీఎస్

దళిత ఎస్ఐ శ్రీరాముల శ్రీను ఆత్మహత్య ఘటనపై ముఖ్యమంత్రి స్పందించాలని, సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ డిమాండ్ చేశారు. ఖమ్మంలో ఆ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

'దళితులపై వేధింపులు ఆపాలి'

ఖమ్మం సిటీ, జూలై 8: దళిత వర్గాలపై వేధింపులు ఇటీవల ఎక్కువయ్యాయని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంతేటి వీరభద్రం అన్నారు. తక్షణమే వాటిని ఆపాలని డిమాండ్ చేశారు. ఖమ్మంలోని అంబేద్కర్ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగుల సదస్సులో ఆయన మాట్లాడారు. తమ వర్గాలకు జరుగుతున్న అన్యాయాలను ఎప్పటికప్పుడు ఎండగట్టేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అఫ్జల్‌హసన్‌కు నేతల పరామర్శ

ఖమ్మం సిటీ, జూలై 8: కాంగ్రెస్ సర్కారు అనుకూల అధికారులు, ఉద్యోగుల వేధింపులు తాళలేక తీవ్ర మనస్తాపంతో రెండు రోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన టీఎన్‌జీవోస్ నేత అఫ్జల్‌హసన్‌ను వివిధ మైనార్టీ సంఘాల నేతలు సోమవారం పరామర్శించారు. ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడిని ఆయా సంఘాల నేతలు కలిసి మాట్లాడారు. అఫ్జల్‌పై ఉద్దేశపూర్వకంగా కేసులు బనాయించడం సరికాదని అన్నారు. అనంతరం అఫ్జల్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ సీపీకి వినతిపత్రం అందించారు. మైనార్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కారేపల్లి పీహెచ్‌సీని 50 పడకల ఆసుపత్రిగా చేయాలి

కారేపల్లి, జూలై 8: కారేపల్లి పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేస్తూ 50 పడకల ఆసుపత్రిగా మార్చాలని తెలంగ